www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 ఫిబ్రవరి 2025 | 5 | తూర్పుగోదావరి





కానరాని ఎన్నికల కోడ్

ఎన్నికల వేళ కడియం మండలంలో నాయకుల విగ్రహాలు ఇలా దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల నాయకుల ఫ్లెక్సీలుకూడా అలానే ఉన్నాయి. దీంతో అసలు ఇక్కడ ఎన్నికల కోడ్ ఉందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. :: ప్రజాశక్తి - కడియం ::

పౌల్ట్రీ పట్టీ

- బర్డ్ ఫ్లూతోచికెన్, గుడ్ల ధరలు పతనం
- కొనుగోలుకు వెనకడుగేస్తున్న ప్రజలు
- వెలవెలబోతున్న చికెన్ షాపులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పౌల్ట్రీ రంగంపై బర్డ్‌ఫ్లూ తీవ్ర ప్రభావం చూపిస్తోంది. 15 రోజులుగా చికెన్ పేరు వింటేనే జిల్లా వాసులు హడలిపోతున్నారు. దీంతో చికెన్ అమ్మకాలు నేలను తాకాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ కారణంగా కోళ్ళు మరణించిన విషయం విధితమే ఫలితంగా రెడ్ జోన్ ఉన్న ప్రాంతాల్లో కొన్ని రోజుల పాటు చికెన్, గుడ్డు విక్రయాలపై అధికారులు నిషేధం విధించారు. జిల్లా అంతటా ప్రస్తుతం అటువంటి నిబంధనలు లేకపోయినప్పటికీ ప్రజల్లో భయం వెంటాడుతోంది. మరోపక్క సామాజిక మాధ్యమాల్లో ప్రచారంతో ఎక్కువ మంది చికెన్, గుడ్డు తినడం మానేశారు. ఫలితంగా చికెన్, గుడ్డు ధరలు భారీగా పడిపోయాయి. వినియోగదారులు కన్నెత్తి చూడకపోవడంతో చికెన్ షాపులు బోసిపోతున్నాయి. వారం రోజులుగా దుకాణాలు వెల వెల బోతున్నాయి. దీనిపై ఆధారపడిన వారికి ఉపాధి కరువైంది. దీంతో జిల్లాలో పౌల్ట్రీ రంగం తీవ్ర సంక్షోభంలో పడిపోయింది. మరోపక్క జనాలు చికెన్‌కు బదులు చేపలు, మటన్ తినేందుకు ఇష్టపడుతున్నారు. దీనివల్ల చేపలు, మటన్ దుకాణాల వద్ద రద్దీ నెలకొంటుంది.

జిల్లాలో అనపర్తి, బిక్కవోలు, పెరవలి, ఉండ్రాజవరం, రాజానగరం, రంగంపేట మండలాల్లో రైతులు పౌల్ట్రీ ఫామ్‌లను నిర్వహిస్తున్నారు. మొత్తంగా 2.1 కోట్ల కోళ్ళు ఉన్నాయి. 80 లక్షల గుడ్ల ఉత్పత్తి అవుతున్నాయి. ప్రస్తుతంలో బర్డ్‌ఫ్లూ ప్రబలక ముందు జిల్లా వ్యాప్తంగా చికెన్ విక్రయాలు జోరుగా జరిగేవి. ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ ప్రభావంతో విక్రయాలు పడిపోయాయని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. వారం రోజుల క్రితం మార్కెట్లో స్కిన్‌లెస్ కేజీ రూ.240, స్కిన్ రూ.200 ఉండేది. ప్రస్తుతం స్కిన్‌లెస్ రూ.170, స్కిన్ రూ.150కి పడిపోయింది. ఇక లైవ్ విషయానికొస్తే కేజీ రూ.100 నుంచి రూ.110కి వచ్చేసింది. గుడ్డు గత నెలలో రూ.7 ఉండేది. ప్రస్తుతం రూ.6కు అమ్ముతున్నారు. ఇలాగే పరిస్థితి ఉంటే కేజీ చికెన్ రూ.100కు అమ్ముకునే దుస్థితి ఏర్పడుతుందని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ప్రతి పౌల్ట్రీలోనూ కోళ్లకు వ్యాక్సిన్లు వేయిస్తున్నారు. దీంతో రూ.లక్షల్లో ఖర్చు అవుతోంది. మరోపక్క చికెన్ అమ్మకాలు భారీగా పడిపోయాయి. దీంతో పౌల్ట్రీ వ్యాపారులు నష్టాలు చవిచూస్తున్నారు. ఈ నెల రెండో వారంలో పౌల్ట్రీలో హోల్‌సేల్‌గా గుడ్డు ధర రూ.5.70 ఉండగా 15వ తేదీకి రూ.1.10 తగ్గి రూ.4.60కి చేరింది. క పౌల్ట్రీ నుంచి రోజుకి 2 లక్షల గుడ్లు బయటకి వెళ్తుంటాయి. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ధరలు పడిపోవడంతో ఈ రెండు లక్షల గుడ్లపై రూ.2లక్షలు ప్లపోతున్నామని పౌల్ట్రీ వ్యాపారులు వాపోతున్నారు. చికెన్ లైవ్ హోల్‌సేల్‌లో కేజీ రూ.48కి పడిపోగా, మార్కెట్లో లైవ్ రూ.100కి పడిపోయింది. ఈ నష్టాల నుంచి కోలుకోవాలంటే మరో రెండేళ్లు పడుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో చికెన్ వద్దంటున్న జనం మటన్, చేపల వైపు మొగ్గు చూపిస్తున్నారు. దీంతో వాటి విక్రయాలు ఒక్కసారిగా పెరిగాయి. ధరలకు కూడా రెక్కలు వచ్చేశాయి. మటన్ కేజీ రూ.900 నుంచి రూ.వెయ్యి, చేపలు కేజీ రూ.250 నుంచి రూ.300 వరకు పెరిగింది. జిల్లాలో చేపల మార్కెట్లు, మటన్ విక్రయ కేంద్రాల వద్ద జనాలు క్యూ కడుతున్నారు. మరో వైపు చికెన్ దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.



పెరవలి మండలంలో బర్డ్ ఫ్లూతో చనిపోయిన కోళ్లు (ఫైల్)

నేలను తాకుతున్న ధరలు

బర్డ్ ఫ్లూ భయం కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం పడింది. ఫలితంగా కోడి మాంసం, గుడ్డు ధరలునేలను తాకుతున్నాయి. బర్డ్‌ఫ్లూ దెబ్బకు రోజుకు రూ.2లక్షలకు పైగా నష్టం వస్తుంది. గత వారం రోజుల్లో గుడ్డు ధర రూ.5.70 నుంచి రూ.4కు పడిపోయింది. ఒక గుడ్డుకి 1.70పైసలు నష్టం వస్తుంది. హోల్‌సేల్‌లో గుడ్డు రూ.4కు విక్రయిస్తున్నారు. మార్కెట్లో మాత్రం గుడ్డు ధర తగ్గలేదు. ఇదే కొనసాగితే పూర్తిగా నష్టాలపాలవుతాం. ప్రభుత్వం స్పందించి పౌల్ట్రీరంగాన్ని ఆదుకోవాలి.

- జి.రాజబాబు, పౌల్ట్రీ రైతు, పెరవలి

చికెన్ తినట్లేదు

జిల్లాలో బర్డ్‌ఫ్లూతో కోళ్ళు చనిపోతున్నాయని సామాజిక మాధ్యమాల్లో చూస్తున్నాం. ఆ భయంతోనే చికెన్, గుడ్డు తినడంలేదు. ప్రత్యామ్నాయంగా చేపలు, మటన్ కొంటున్నాం. ప్రస్తుతం ఆ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ధర నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. బర్డ్‌ఫ్లూ పైనా కూడా స్పష్టమైన ఆదేశాలివ్వాలి.

- కె.మహాలక్ష్మి, గృహిణి, ఆర్యాపురం

డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఇవే...

రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్మీడియేటరీ స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్మీడియేటరీ, స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 26న ఆయా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా ఎన్నికల పోలింగ్ సామాగ్రిని ఎన్నికల సిబ్బందికి అందజేస్తారు. అదే విధంగా పోలింగ్ పూర్తయిన అనంతరం ఎన్నికల సామగ్రి చేర్చేందుకు ఆయా ప్రాంతాల్లో రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్మీడియేటర్ స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. కాకినాడ జిల్లాకు సంబంధించి కాకినాడ కలెక్టరేట్‌లో, ఎఎస్‌ఆర్ జిల్లాకు సంబంధించి రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, రామచంద్రాపురం వివిఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో, కొత్తపేట ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి భీమవరం కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలు, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోను, ఏలూరు జిల్లాకు సంబంధించి వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో, జంగారెడ్డిగూడెంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఇంటర్మీడియేటర్ స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా జిల్లాల్లో ఇంటర్మీడియేటర్ స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రిని ఏలూరు జిల్లా వట్లూరులోని సిఆర్‌రెడ్డి కళాశాలకు తరలిస్తారు. ఏలూరు జిల్లా వట్లూరులోని సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలు

కాకినాడ జిల్లా : కాకినాడ ఎంఎస్‌ఎన్ చారిటీస్ హైస్కూల్, పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయం

ఎఎస్‌ఆర్ జిల్లా : రంపచోడవరం సబ్ కలెక్టర్ ఆఫీసు, చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా : అమలాపురం అగ్రహారంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రామచంద్రపురంలోని వివిఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల, కొత్తపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

పశ్చిమగోదావరి జిల్లా : భీమవరం, నర్సాపురం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయాలు


తూర్పుగోదావరి జిల్లా : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల

ఏలూరు జిల్లా : ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని గిరిజన భవన్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం

ఉత్సాహంగా ఉద్భవ్-2025

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్ యువజన ఉత్సవం ఉత్సాహంగా సాగుతోంది. శుక్రవారం రెండో రోజు మరింత మంది విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పెయింటింగ్, సుడోకు, పోస్టర్ మేకింగ్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, రంగవల్లుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం విద్యార్థులకు లైవ్ మ్యూజిక్ నిర్వహించామని ఉద్భవ్ కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున తెలిపారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం డ్యాన్స్, మ్యూజిక్, సంప్రదాయ వస్త్రధారణ తదితర అంశాలపై పోటీలు నిర్వహిస్తామని, ముగింపు సభ ఉంటుందని ప్రిన్సిపల్ రామచంద్ర తెలిపారు.



పొగాకు పంట సమాచారాన్ని ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

వర్జీనియా పొగాకు పండించే రైతులు ఇన్సూరెన్స్, ఆర్థిక, ఇతర సహకారాలు ప్రభుత్వం నుంచి పొందాలంటే పంటకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అధికారులకు అందించాలని మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని అన్నదేవరపేటలో దుగ్గిరాల సుబ్బారావు, పోసిన నారాయణరావు రైతులు పండిస్తున్న వర్జీనియా పొగాకు పంటను అధికారులు శుక్రవారం పరిశీలించారు. పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆకులు వేరు చేసే సమయంలో రైతులు వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సతీష్ సుబ్బారావు, నారాయణ, సాయి, రైతులు పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

ఆకుకూరల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం


మండలంలోని వెలగదుర్రు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వాటికలో అంగన్‌వాడీ కార్యకర్తలు పండించిన ఆకుకూరలను గర్భిణులు, బాలింతలకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాగి పద్మావతి మాట్లాడుతూ అత్యంత పోషక విలువలు కలిగిన ఆకుకూరలు తరచూ తినడం ద్వారా అనేక అనారోగ్యాలకు దూరంగా ఉండొచ్చన్నారు. ముఖ్యంగా గర్భిణిలకు ఆకుకూరలు, పండ్లు మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముదునూరి రవీంద్రరాజు, వైసిపి నాయకులు ధనిశెట్టి మహేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ దుర్గాభవాని, మహిళా సంరక్షణ కార్యదర్శి బి.మేరీవిజయకుమారి, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నన్నయ్య విసిని కలిసిన జైలు సూపరింటెండెంట్ రాహుల్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నన్నయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎస్.ప్రసన్నశ్రీని రాజమహేంద్రవరం కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ గౌరవ పూర్వకంగా కలిశారు. శుక్రవారం విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయంలో రాహుల్ విసిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఖైదీలకు మనోవికాస శిక్షణ కోసం సైకాలజీ ఆచార్యులను అందించాలని, జైల్లో జరిగే పలు విద్యా కార్యక్రమాలకు యూనివర్సిటీ ద్వారా సహకారం అందించాలని సూపరింటెండెంట్ కోరగా అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు.

కార్టూ'నిజం'



మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రముఖ శైవక్షేత్రాల్లో నిర్వహణ ఏర్పాట్లపై ఎస్‌పి డి.నరసింహకిషోర్, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, దేవాదాయ శాఖ, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, మత్స్య అధికారులతో కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రధానంగా నగరంలో, జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉన్న శైవక్షేత్రాల్లో వేలాది మంది యాత్రికులు స్నానాలు చేస్తారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ముఖ్యంగా సీతానగరం మండలం వంగళపూడి నుంచి పట్టిసీమ వీరభద్రస్వామి దేవస్థానం, కొవ్వూరు గోష్పాద క్షేత్రం, రాజమహేంద్రవరం నగరంలో పుష్కరఘాట్, మార్కండేయ స్వామి దేవస్థానం ఘాట్, కోటిలింగాల ఘాట్‌లకు వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టిసీమలో దర్శన సమాచారాన్ని అందించే విధంగా కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని శైవక్షేత్రాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి ఘాట్‌లో అవసరమైన బొట్లతో పాటూ గజ ఈతగాళ్లను , పోలీసు సిబ్బందిని నియమించాలన్నారు.

జిల్లాలోని ప్రతి మండల కేంద్రాల్లోని శివాలయాలు వద్ద శానిటేషన్ పనులను నిర్వహించాలన్నారు. దేవాలయాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, ఆర్‌డబ్ల్యుఎస్, మెడికల్ అధికారులతో కలిసి తాగునీటి సౌకర్యాన్ని, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసుకోవాలన్నారు. యాత్రికులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సు సదుపాయం కల్పించాలన్నారు. ఉత్సవాలు జరిగే క్షేత్రాల్లో ఎక్కడా మద్యం అమ్మకాలు లేకుండా చూడాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్ అందుబాటులో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి చోటా మహిళలకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొవ్వూరు, రాజమహేంద్రవరం డివిజన్‌లో మున్సిపల్ కార్యాలయాల్లో పట్టిసీమలో భక్తులకు సమాచారం అందించే విధంగా కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చెయ్యాలన్నారు.

ఎస్‌పి డి.నరసింహకిషోర్ మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా అన్ని శైవక్షేత్రాలలో పోలీసు బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన చోట అధిక పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని ప్రముఖ శైవక్షేత్రాల వద్ద ఎస్‌డిఆర్ఎఫ్. సిబ్బంది, రెస్క్యూ టీమ్, ఫైర్ ఇంజన్ వాహనాలను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసుల హెచ్చరిక నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, అడిషనల్ ఎస్‌పి ఎల్.అర్జున్, ఆర్‌డిఒలు కృష్ణనాయక్, రాణి సుస్మిత, డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి, జిల్లా రవాణా అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

విద్యార్థినిలకు మహిళా రక్షక్ టీమ్ అవగాహన

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి విద్యార్థిని తన బంగారు భవిష్యత్తుకు ఉత్తమ బాటలు ఏర్పాటు చేసుకోవాలని రక్షక్ టీమ్ సభ్యులు సూచించారు. మండలంలోని వేగేశ్వరపురంలోని జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, అన్నదేవరపేట ఉన్నత పాఠశాలలోని విద్యార్థినిలకు ఎస్‌పి ఆదేశాల మేరకు తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ పర్యవేక్షణలో శుక్రవారం రక్షక్ టీమ్ కూగాహన కల్పించింది. ఆరాచక శక్తులు, ఈవ్‌టీజింగ్ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మగ విద్యార్థులతో సైతం ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. మొబైల్స్, ట్రాప్స్‌కి గురి కాకుండా విద్యార్థినులు ఏమైనా ఇబ్బందులకు గురైతే ఏ నెంబర్లకు ఫోన్ చేయాలో వివరించారు. వివిధ పాఠశాలల్లో జరిగిన ఈ అవగాహనా కార్యక్రమంలో ఎంఇఒలు బాలామణి, నెహ్రూజీ, ప్రిన్సిపల్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు అర్జునరావు, రాజమండ్రి నైలా పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ రామన్న, మహిళ రక్షక్ టీం సభ్యులు శైలజ, అనిత, భవాని, భవ్య తదితరులు పాల్గొన్నారు.



యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

యువత క్రీడల్లో రాణించాలని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు సూచించారు. శుక్రవారం చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 42వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఆర్థికంగా, పేరు ప్రఖ్యాతలు, ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల పట్ల మక్కువ చూపించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటినీ సమానంగా స్వీకరించాలన్నారు. రెండు రోజులు పాటు జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల పోటీల్లో 13 జిల్లాల క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. ఈ పోటీల్లో సత్తా చాటిన ఆరుగురు బాలురు, ఆరుగురు బాలికలు మార్చి 25 నుంచి 29 వరకూ ఒడిశా రాష్ట్రం కటక్‌లో జరిగే నేషనల్ క్రీడా పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లాకు రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖర్, రవీంద్ర, సెక్రటరీ కెఎన్‌వి.సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, ఎ.వెంకటేశ్వరరావు, రామకృష్ణంరాజు, ఎం.లక్ష్మణరావు, మునీశ్వరరావు, రమేష్, సిఆర్‌పి కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పోటీల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న డిఎస్ఇఒ వాసుదేవరావు

ఆర్‌టిసి డిపోను సందర్శించిన ఇడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ఆర్‌టిసి బస్ డిపోను ఎపిఎస్ ఆర్‌టిడిసి ఇడి టి.చంగల్‌రెడ్డి, జి.విజయరత్నం శుక్రవారం సందర్శించినారు. బస్ స్టేషన్, గ్యారేజీలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం గేట్ మీటింగ్ నిర్వహించారు. ప్రయాణికులకు శుభ్రమైన, సౌకర్యవంతమైన బస్సులను అందించాలన్నారు. అందరూ కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిళఅశోక, డిపో మేనేజర్ షేక్ షబ్బం, గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అధికి కెఎంపిఎల్, ఇపికె సాధించిన డ్రైవర్, కండక్టర్లకు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందించారు.




డ్రైవర్లకు పురస్కారాలు అందిస్తున్న ఇడిలు

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్, ఆర్ అండ్ ఎసిలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ ఐఎల్‌టిడి సెంటర్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, రిఫ్రిజిరేటర్ మరియు ఎసి రిపేర్ సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. 19 నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. పదో తరగతి పాసై తెల్ల రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్ కలిగన నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు 0883-2420,2428807 7780599939, 9701359954, 9014328803 నెంబర్లను సంప్రదించాలన్నారు.



రీసర్వేను పరిశీలిస్తున్న జెసి చిన్నరాముడు

నిర్దేశించిన ప్రకారం రీ సర్వే చేయాలి

ప్రజాశక్తి-గోకవరం

నిర్దేశించిన ప్రకారం రీసర్వే ప్రక్రియను చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు సర్వే బృందాలను ఆదేశించారు. శుక్రవారం మల్లవరం గ్రామంలో రీ సర్వే పనులు, గ్రౌండ్ ట్రూథింగ్ పనుల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగటున సర్వే బృందాలు రోజుకు 15 ఎకరాల్లో సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 139 బృందాలను నియమించామన్నారు. ఆ మేరకు పురోగతి లేదని తెలిపారు. దేవరపల్లి మండలంలో 59.84 ఎకరాల్లో, గోకవరం మండలంలో 44.9 ఎకరాల్లో రీసర్వే పూర్తయ్యిందన్నారు. కొవ్వూరు లో15.75 ఎకరాలు, గోపాలపురంలో 22.52 ఎకరాల్లో రీసర్వే నెమ్మదిగా జరుగుతుందన్నారు. రీసర్వే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, రెవెన్యూ, సర్వే అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు, భూ యజమానులు ఉన్నారు.

ప్రతిపాదనలు లేకుండా మండల సమావేశం

ప్రజాశక్తి - చాగల్లు

ఎలాంటి ప్రతిపాదనలు లేకుండానే మండల పరిషత్ సమావేశంలో ముగిసింది. చాగల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండల అధ్యక్షులు మట్టా వీరాస్వామి అధ్యక్షతన శుక్రవారం ఈ సమావేశం జరిగింది. ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి ప్రతిపాదనలు జరపకూడదన్నారు. మండల సమావేశం మూడు నెలలులోపు జరపాల్సి ఉన్నందున నిర్వహించాల్సి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

గర్భిణులను, బాలింతలకు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ అధికారి కె.విజయకుమారి సూచించారు. శుక్రవారం శంభు నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లో స్వామి రఘువీరా నందజీ మహరాజ్, డిఎంహెచ్ఒ కె.వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ కె.విజయ కుమారిలతో కలిసి రామకష్ణ మిషన్ కేంద్రం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయ కుమారి మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు పోషకాహారం తీసుకోవాలన్నారు. ఐరన్, కాల్షియం, విటమిన్లు ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. డిఎంహెచ్ఒ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రామకష్ణ మిషన్ ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమనాౖఉ.అనంతరం 125 మంది గర్భిణులు, బాలింతలు, 75 మంది చిన్నారులకు వైద్యులు సునీత, ఎస్.మణికంఠ, వైద్య పరీక్ష లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ పి.ప్రసన్నలక్ష్మి, వార్డు మెంబర్ కె.ఆంటోనిదాస్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఎటిఎం కార్డు మార్చి రూ.26 వేల చోరీ

ప్రజాశక్తి - పిఠాపురం

ఎటిఎం కార్డును మార్చి అకౌంట్ నుంచి రూ26వేలు చోరీ చేశాడో వ్యక్తి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాధవపురం గ్రామానికి ఎం.త్రిమూర్తులు గురువారం ఉదయం మాధవపురం సెంటర్‌లో ఎస్‌బిఐ ఎటిఎం వద్దకు డబ్బులు డ్రా చేసేందుకు వెళ్ళాడు. అక్కడ ఓ గుర్తు తెలియని వ్యక్తిని డబ్బులు డ్రా చేయమని అడిగాడు. ఆ వ్యక్తి ఎటిఎం కార్డు తీసుకుని మిషన్‌లో పెట్టి డబ్బులు రావట్లేదని వెనకకు తీసి వేరొక ఎటిఎం కార్డు ఇచ్చేశాడు. అది గమనించని త్రిమూర్తులు మళ్లీ ఎటిఎంలో కార్డు పెట్టి పిన్‌ను ఎంటర్ చేయగా ర్యాంగ్ అని వచ్చింది. వెంటనే తన ఖాతా ఉన్న యూనియన్ బ్యాంక్ వెళ్లి వాకబు చేశాడు. ఆ కార్డు తనది కాదని సిబ్బంది ద్వారా తెలుసుకున్నాడు. అప్పటికే త్రిమూర్తులు ఎకౌంట్ నుంచి నాలుగు దఫాలుగా రూ.26వేలు డ్రా చేసినట్లు తెలుసుకుని వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న లారీ

మట్టి లారీల స్వాధీనం

ప్రజాశక్తి - రావులపాలెం

మండలంలో బొండు మట్టి అక్రమంగా తరలిస్తున్న లారీలను స్వాధీనం చేసినట్లు తహశీల్దార్ బియం. ముక్తేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండల స్థాయి టాస్క్ ఫోర్స్ నిర్వహించిన సాధారణ తనిఖీల్లో భాగంగా అక్రమంగా బొండు మట్టి తరలిస్తున్న మూడు లారీలను స్వాధీనం చేసుకొని జరిమానా విధించామని తహశీల్దార్ తెలిపారు. మండల స్థాయిలో ఇసుక, మట్టి, బొండు మట్టిని అక్రమంగా తరలించిన వారిపై చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామన్నారు.

స్వయం సహాయక సంఘాల ఏర్పాటు

ప్రజాశక్తి - యానాం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీనదయాళ్ జన్ ఆజీవిక యోజన-పట్టణ ఉపాధి పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారికి స్వయం సహాయక పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కండవల్లి రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామి సమక్షంలో శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో విడుదల చేస్తామని తెలిపారు.




టివిని అందజేస్తున్న దాత సుబ్బారావు

వికలాంగుల పాఠశాలకు టివి అందజేత

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఫెర్రీ రోడ్డులోని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ వికలాంగుల పాఠశాలకు కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామానికి చెందిన మద్దాల సుబ్బారావు టివిని బహుకరించారు. పాఠశాల ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ టీవీని పిల్లలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.సుశీల, కె.మహేశ్వరి, డి.వీరవేణి, దుర్గ, తాతారావు పాల్గొన్నారు.



ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న కార్మికులు

వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - యానాం

అధికారుల నిర్లక్ష్యం వల్లే హెచ్‌ఆర్ స్క్వేర్ సంస్థ పారిశుధ్య కార్మికులకు వేతనాలు రావడం లేదని పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయం గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌ఆర్ స్క్వేర్ సంస్థ కార్మికులపై మున్సిపల్ కమిషనర్ వివక్ష చూపిస్తున్నారన్నారు. 11 నెలలుగా జీతాలు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. సంస్థపై తప్పుడు ఫిర్యాదులు మానుకోవాలని, తక్షణమే పెండింగ్ బిల్లులు సంస్థకు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ ఎడ్యుకేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులను విద్యాశాఖ అధికారి బి.శ్రీనివాసరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 58 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు ఆరు రోజులపాటు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణ వారికి పునాదిలాంటిదన్నారు. అభ్యాసనను బలోపేతం చేయటం, పిల్లలు ఆటలు, పాటలు ద్వారా అభ్యాసన చేయడం, తలిదండ్రులకు సమాజం భాగస్వామ్యం, తదితర అంశాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పి నిర్మలకుమారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు హిమశ్రీ, ఫాతిమా, ట్రయినీ ఆర్‌పి కృష్ణకాంత్, బాపిరాజు, పాఠశాల జిహెచ్‌ఎం,వీరభద్రం, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జెసి ఎస్.చిన్నరాముడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశానికి జెసి అధ్యక్షత వహించి మాట్లాడారు. రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తతంగా నిర్వహించాలన్నారు. ప్రజలు నియమ నిబంధనలు పాటించేలా స్వీయ రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో 27 జాతీయ, 6 రాష్ట్ర, 2 ఇతర రహదారులలో 35 బ్లాక్ స్పాట్స్ గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. రోడ్డు ప్రమాదాలను, మరణాలను తగ్గించడానికి కావాల్సిన జాగ్రత్తలు పాటించాలన్నారు. బ్లాక్ స్పాట్లలో లైటింగ్, సైన్ బోర్డ్, బ్లింకర్స్ సిగ్నల్, జీబ్రా లైన్స్, స్పీడ్ బ్రేకర్ లాంటివి ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారుల్లో కొన్నిప్రదేశాల్లో ప్లాంటేషన్, లైటింగ్ చేపట్టాలన్నారు. మోటార్ వాహనాల చట్టం పరిధిలో 2023 ఏడాదిలో 11,849 కేసులు నమోదు చేసి, రూ.10,32,72,000 జరిమానా విధించామన్నారు. 2024లో 4,204 కేసులు నమోదు చేసి రూ.8,82,41,000 జరిమానా విధించామన్నారు. 2023లో 45 కేసులకు రూ.67,500, 2024లో 15 కేసులకు రూ.20 వేల అపరాధ రుసుం వేశారన్నారు. ఎన్‌జిఒలు రానున్న రోజుల్లో ప్రత్యేకంగా రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలతో పాటు రోడ్డు భద్రతపై స్లొగన్స్ ప్రదర్శించాలన్నారు. రాజమహేంద్రవరం నగరంలో సిసి కెమెరాల నిర్వహణ, దాని ఫీడ్ పోలీస్, జిల్లా కంట్రోల్ రూమ్‌లోకి రావాలన్నారు. ప్రమాదం జరిగిన తొలి గంట గోల్డెన్ అవర్ అన్నారు. ప్రమాదం జరిగిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తే విలువైన ప్రాణాలు దక్కుతాయని తెలిపారు. నేషనల్ హైవే హెల్ప్ లైన్(ఎమర్జెన్సీ) నెంబర్ 1033పై విస్తతంగా అవగాహన కల్పించాలన్నారు. జాతీయ రహదారులపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో పలుచోట్ల నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను నివారించాలని, నగరంలోని పోలీస్ పెట్రోల్ బంకు వద్ద ఇతర రద్దీ ప్రదేశాల్లో వాహనదారులు సౌండ్ పొల్యూషన్ చేయకుండా ఉండేందుకు, అవగాహన కల్పించే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారులు వాహనాలను నడుపకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ మాట్లాడుతూ 2024లో మోటారు వాహనాల డ్రైవింగ్ ఉల్లంఘనకు సంబంధించి 84,557 కేసులు నమోదు చేసి రూ.3,30,03,334 పెనాల్టీ వేశామన్నారు. హెల్మెట్ ధరణ కోసం ఎన్ని సార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రజల్లో చైతన్యం రావడం లేదన్నారు. 2025 జనవరి ఒక్క నెలలో 10,122 కేసులు నమోదు చేసి రూ.41,46,041 వసూలు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బి ఎస్ఇ ఎస్‌బివి.రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నేషనల్ హైవే పీడీ డి.సురేంద్రనాథ్, జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు, ఆర్ఎంఒ వి.వినూత్న తదితరులు పాల్గొన్నారు..



సమావేశంలో మాట్లాడుతున్న జెసి చిన్నరాముడు

మాతృభాష సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - రాజానగరం

మాతృభాష రక్షణ అందరి బాధ్యత అని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం విసి ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ సెమినార్ హాల్లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఇంగ్లీషు డిపార్టమెంట్, తెలుగుశాఖ ఆధ్వర్యంలో మాతృభాషా దివస్ పేరుతో ఈ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విసి హాజరై మాట్లాడారు. మాతృభాషపై పాశ్చాత్య భాషల ప్రభావం ఉంటుందన్నారు. అయినప్పటికీ అమ్మ భాషను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందనన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.సుధాకర్, నండూరి జయలక్ష్మి, ప్రిన్సిపల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, ఆంగ్ల శాఖ విభాగాధిపతి డాక్టర్ ఎన్.సజనారాజ్, తెలుగు శాఖాధిపతి డాక్టర్ దొంతరాజు లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కడియం : ఎందరున్నా జన్మనిచ్చిన మాతృమూర్తిని, ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువరాదని ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ ప్రత్యేకతను వివరించారు. ఇంగ్లీష్ టీచర్ కర్రి రాజు పాడిన తెలుగు పద్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.శరత్‌బాబు, పెర్సీ పుష్పలత, గిరిజ, రఫీయుద్దీన్, సువర్ణవేణి, హనుమంతరావు, వీరరాఘవకుమారి పాల్గొన్నారు.

పెరవలి : మండలం కాకరపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు అష్ట దిగ్గజాల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఏకపాత్రాభినయాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు హరిబాబు, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సత్య వరలక్ష్మి, సుల్తానా విద్యార్థులు పాల్గొన్నారు

తాళ్లపూడి : మాతృభాషను ఎన్నటికీ మరువకూడదని బల్లిపాడు మండల ప్రజా పరిషత్ జూనియర్ బేసిక్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జివికె.రాజు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సచివాలయ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఫాహీం హాజరై మాట్లాడారు. మాతృభాష ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గూడపాటి వరలక్ష్మి, మహిళా పోలీస్ బిందు తదితరులు పాల్గొన్నారు.



మాతృభాషా దినోత్సవంలో మాట్లాడుతున్న నన్నయ యూనివర్శిటీ విసి ప్రసన్నశ్రీ



తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ కృష్ణనాయక్

ఎంఎస్ఎల్ పాయింట్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని పౌర సరఫరాల ఎంఎస్ఎల్ పాయింట్‌ను ఆర్‌డిఒ కృష్ణనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎల్ పాయింట్ వద్ద ఉన్న బియ్యం స్టాక్‌కు సంబంధించి ప్రతి బస్తా 50 కేజీలు, గన్నీ బ్యాగు బరువు కాకుండా ఉండాలన్నారు. సాధారణంగా గన్ని బ్యాగు బరువు 580 గ్రాములు ఉంటుందని తెలిపారు. పరిశీలన సమయంలో కొన్ని బియ్యం బస్తాల బరువు 50 కేజీలు, 49.800 కేజీలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎంఎస్ఎల్ పాయింట్ నుంచి చౌక ధరల దుకాణాలకి పంపిణీ చేసే విధానంలో గన్ని బ్యాగు బరువు కాకుండా 50 కేజీలు ఉండాలని స్పష్టం చేశారు. బఫర్ స్టాక్ గోడౌన్ నుంచి తీసుకుని వచ్చే సందర్భంలో సరి చూసుకునే బాధ్యత ఎంఎస్ఎల్ పాయింట్ ఇన్‌ఛార్జిదేనని స్పష్టం చేశారు. ఆయన వెంట రూరల్ తహశీల్దార్ కుమార్, ఎంఎస్-ఎల్ పాయింట్ ఇన్‌ఛార్జి డిటి.శ్రీనివాస్, పౌర సరఫరాల సంస్థ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

23న హేవ్‌లాక్ షోకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బౌ.. వావ్ పెట్ షాపీ, స్పా సమర్పణలో ఈ నెల 23న రాజమహేంద్రవరం బ్రీడ్ ఛాంపియన్‌షిప్ సీజన్-2 హేవ్ లాక్ షో(డాగ్, క్యాట్ షో) నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తరుణ్ కలీమ్ తెలిపారు. సీజన్-1లో నిర్వహించిన జెఎన్ రోడ్డులోని ఐరన్ హిల్ ఎదురుగా గల దారా గ్రౌండ్స్‌లో 23 మధ్యాహ్నం 4 గంటల నుంచి షో జరుగుతుందని తెలిపారు. డాగ్ షో నిర్వహిస్తున్న దారా గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ఈ వివరాలను వెల్లడించారు. రాజమండ్రి బ్రీడ్ ఛాంపియన్‌షిప్ సీజన్-1కి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఇటీవల చెన్నైలో కెనల్ క్లబ్ ఆఫ్ ఇండియా నిర్వహించిన డాగ్ షోకి హాజరు కాగా రాజమండ్రి బ్రీడ్ ఛాంపియన్షిప్ అద్భుతంగా నిర్వహించామని అక్కడివారు కితాబు ఇచ్చారని తెలిపారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని సీజన్-2 మరింత గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నామన్నారు. ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా హేవ్ లాక్ బ్రిడ్జి నిలిచిందని, తాము నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు వారధిగా నిలవాలని హేవ్ లాక్ షోగా నామకరణం చేశామన్నారు. ఈ షోలో 50 రకాల డాగ్స్, కేట్ బ్రీడ్‌లు పాల్గొంటాయని తెలిపారు. సీజన్ 1లో ఎపి, తెలంగాణా, ఒడిశాల నుంచి బ్రీడ్‌లు పాల్గొన్నాయని, సీజన్ 2కి కర్నాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి కూడా బ్రీడ్‌లు హాజరవుతాయని తెలిపారు. ఛాంపియన్‌గా నిలిచిన డాగ్‌కు రూ.50 వేల బహుమతి అందజేస్తామని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి బ్రీడ్‌లను పెట్ డాగ్ ప్రేమికులు ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న తరుణంలో మన రాష్ట్ర బ్రీడ్ అయిన కొల్లేటి జాగిలం విశిష్టత తెలియజేసే విధంగా కొల్లేటి జాగిలం డాగ్ ప్రత్యేక షో జరుగుతుందన్నారు. పెట్ డాగ్‌లకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నది వాటి యజమానులతో మాట్లాడితే అర్థం అవుతుందన్నారు. ఈ షోకు హాజరయ్యే ప్రతి పెట్ డాగ్‌కి ఎఆర్‌వి వ్యాక్సిన్ వేస్తామన్నారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో కూలర్‌లు, మంచినీటి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. డాగ్ లకు శిక్షణ ఇవ్వడంపై లైవ్ డెమానిస్ట్రేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీజన్ 1లో ఇచ్చిన హామీ మేరకు 300 స్ట్రీట్ డాగ్స్‌కి స్కిన్ డీసీజస్ రాకుండా ఐవిన్మెట్రిన్ డోస్లు, 50 డాగ్లకు వాక్సినేషన్ చేయించామని, ప్రమాదాలకు గురైన 10 డాగ్లకు ట్రీట్మెంట్ అందించామని వివరించారు ప్రమాదాలకు గురైన డాగ్‌కు చికిత్స అందించడానికి ఎప్పుడూ తమ క్రూ సిద్ధంగా ఉంటుందన్నారు. 23న సాయంత్రం 4 నుండి రాత్రి 10 గంటల వరకు జరిగే ఈ షోలో పాల్గొనేవారు మధ్యాహ్నం 2గంటలకల్లా హాజరవ్వాలన్నారు. ముఖ్య అతిథిగా తెలంగాణా కెన్నెల్ క్లబ్ కార్యదర్శి, కెన్నల్ క్లబ్ ఆఫ్ ఇండియా సభ్యులు విశాల్ సుదాన్, జడ్జిలుగా ప్రొఫెషనల్ ట్రైనర్లు టి.సతీష్‌గౌడ, జి.దినేష్‌గౌడ వ్యవహరిస్తారన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో శ్రీను, నాగేంద్ర, నాని, దీపక్, అఖిల్, బాజీ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ప్రదర్శిస్తునన డాగ్‌షో నిర్వాహకులు

ప్రాచీన యుద్ధ కళలను పాడుకోవాలి

వైసిపి రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రాచీన యుద్ధ కళలను సంరక్షించుకోవాలని, వాటి నిర్వాహకులను ప్రోత్సహించినప్పుడే ఈ కళలు నిలుస్తాయని వైసిపి రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. మార్షల్ ఆర్ట్స్ ఎపి స్టేట్ ఉషు లీగ్ 2024-25 సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ విభాగం పోటీలు స్థానిక జెఎన్ రోడ్‌లో ఉన్న చెరుకూరి వీర్రాజు, సుబ్బలక్ష్మి కన్వెన్షన్ సెంటర్‌లో ఉషు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఈ పోటీలకు హాజరయ్యారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో పాటూ మాజీ ఎంఎల్ఎ రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా ఉషు పోటీలు నిర్వహిస్తున్న జిల్లా అధ్యక్షుడు అజ్జరపు వాసుని అభినందించారు. ప్రాచీన కళల్లో ఒకటిగా ఉన్న ఈ క్రీడకు ఒలింపిక్స్‌లో కూడా ప్రాధాన్యత ఉందన్నారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించే స్థాయికి ఎదగాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారయ్యేందుకు ఈ క్రీడలు దోహదం చేస్తాయన్నారు. అజ్జరపు వాసు మాట్లాడుతూ రెండ్రోజుల పాటు జరిగిన ఈ పోటీలకు 250 మంది హాజరయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. ఫౌండర్, ఆర్గనైజర్ ముత్యాలరావు మాట్లాడుతూ చైనీస్ మార్షల్ ఆర్ట్స్‌కి చెందిన ఈ ఉషు క్రీడకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ క్రీడా ప్రతిభ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరరావు, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, నాయకులు సుంకర అంజిబాబు, దాది గౌరీ శంకర్, మార్గాని బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న గూడూరి, రౌతు

సైన్స్ క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రావులపాలెం

మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎపిపిఎస్ టిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సైన్స్ క్విజ్ పోటీలలో మండలం విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. 9వతరగతి విభాగం నుంచి గోపాలపురం జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి టి.సుబ్రహ్మణ్యం మొదటి స్థానం సాధించాడు. ఊబలంక ఉన్నత పాఠశాల విద్యార్థిని టి.నిహారిక ద్వితీయ స్థానంలో నిలిచింది. 8వ తరగతి విభాగం నుంచి రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి కె.తరుణ్ మొదటి స్థానం, రావులపాలెం బాలికల ఉన్నత పాఠశాల ఎ జయశ్రీ రెండవ స్థానం సాధించారు. వీరు 25 జరిగే జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు, కోర్స్ సెంటర్ హెచ్‌ఎం కె.వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల నాటి వృక్షానికి నిప్పు

మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని లయన్స్ కళ్యాణ్ మండపం వెనక గల మెయిన్ రోడ్ పై వంద ఏళ్ల నాటి వృక్షానికి నిప్పు అంటుకుంది. చెట్టు చుట్టూ గల చెత్తా గుట్టగా వేసి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు దానికి నిప్పంటించారు. వృక్షానికి నిప్పు అంటుకోవడంతో పొగ మంటలు వ్యాపించాయి. స్థానికులు, మున్సిపల్ సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే అది విఫలం కావడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. మండపేటకు చెందిన ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. మండపేట ఫైర్ ఆఫీసర్ జై హనుమంతరావు, ఐఎఫ్ కిరణ్ కుమార్, ఫైర్ సిబ్బంది సుబ్రహ్మణ్యం, డ్రైవర్ తదితరులు మంటలను అదుపుచేశారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

100 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పశ్చిమ గోదావరి జిల్లా తణుకు రోటరీ క్లబ్, ఏలూరు ఆశ్రం హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం వడ్లూరు గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో ఈసీజీ, చెవి, ముక్కు, గొంతు, కంటి, ఆర్థోపెడిక్, ప్రసూతి వైద్యులు వైద్య సేవలు అందించారనిరోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం మస్తాన్‌రావు, కటారి సిద్ధార్థరాజు తెలిపారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు, మరింత మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆశ్రం హాస్పిటల్‌లో వైద్యం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.